శ్రీరామ నవమికి ప్రత్యేకం ఈ కథ



# కులవృత్తి

'విజయ'

సర్వపరివారమూ వెనుకకు మరలగా, సీతా రాములు లక్ష్మణునితో కూడా గంగా తీరం చేరు కున్నారు. అంత దవ్వు నుండే వారి రాకను తెలుసుకున్న బెస్తపల్లె అంతా సంతోషం పట్టలేకుండా వుంది. పరుగు పరుగున గుహునితో వెళ్ళి చెప్పారీ వార్త.

భక్తులనే నదులన్నింటినీ తన వయిపు ఆకర్షించుకుని తనలో చేర్చుకునే మహాసాగరం కదలివస్తోంది. యోగీ శ్వరులంతా మనసును కన్నులుగా మార్చుకుని చూడ గోరే నీలమేఘం నేలమీద కదలి వస్తున్నది. శత శత వర్షాల తపస్సాధనలతో వాంఛావర్జిత శరీరాన్ని శుష్కింప జేసుకున్నా, స్వామి దర్శన కాంక్షను వీడలేని తాపసుల తపఃఫలం నడచి వస్తున్నది.

పాషాణాన్ని పడతిగా మార్చిన పాదపద్మాలు పచ్చని పచ్చికపై మోపినప్పుడల్లా, కంజదళాలు కాసారాలు వదలి కాంతారాల్లో విరుస్తున్నవా అనిపిస్తున్నవి. అవి గుహుని వాకిటి వరకూ వచ్చినవి. స్వామి ఎదురుకోలుకు బయలు దేరిన గుహుడు గడపలోనే నిలబడిపోయినాడు. పద కమలాలు రాతిని నాతిగా మార్చితే, కలువ కన్నులు మనిషిని శిలగా మార్చేశాయి.

యోగాగ్ని దగ్ధకర్ములకు సయితం అలభ్యమయిన ప్రభుదర్శనం గుహునికి ఇంటి ముంగిటే లభ్యమ యింది. స్వామి చల్లని చూపు చిల్కరించిన కృపారసంతో మంత్రముగ్ధునివలె గుహుడు సజీవ శిల్పమే అయినాడు.

అట్టే నిలబడిపోయినాడు. ఒక పల్కరింపులేదు, ఒక ఆహ్వానం లేదు, ఒక ఆసనం లేదు, ఒక పానీయమూ లేదు. గుహునికి సర్వ ప్రకృతీ స్తంభీభూతమయిపోయి నది. అందులో తాను కూడా లేడు. ఒక్క శ్రీరామ చంద్రుడు తప్ప.

పరిపూర్ణుడయిన పరమాత్మ భక్తులపై ఆధార పడటం ఆయన లీలో, లేక విధి వయిపరీత్యమో! పాదచారియై వచ్చి ప్రభువు తనను గంగను దాటించమని అడిగాడు. తన భాగ్య మేమనవచ్చు! ఏమనడానికైనా ఏదీ! మాటలేదీ! ఒక్క చూపు తప్ప మిగతా ప్రక్రియ లన్నీ మరిచిపోయాడు గుహుడు. దర్శనామృతం ఎంత తాగినా తనివి తీరటం లేదు. రామయ్య మళ్ళా హెచ్చ రించాడు. స్వస్వరూప జ్ఞానం కలిగింది. చుట్టూ వున్న పరివారం... రామయ్య ప్రక్కన సీతమ్మ... ఆ వెన్క లక్ష్మన్న అంతా కనిపించారు. కొద్దిగా సిగ్గులాటిది కలిగింది.

పరుగున వెళ్ళి పాత్రతో గంగాజలం తెచ్చాడు. ప్రభువు పాదాలు కడిగి పాదామృతం పుచ్చుకున్నాడు. చిరునవ్వు నవ్వుతున్న రామచంద్రునికి సంజాయిషీ ఇచ్చుకున్నాడు. నీ చరణ ధూళిసోకి నా నావ కూడా స్త్రీగా మారిపోతే ఒకవేళ! రామా! నా రోజు గడవడం ఎలానయ్యా? ఏమనుకోకు స్వామీ పేదవాడిని. ఇదొ క్కటే నాకాధారం. మనసులో మాత్రం అనుకున్నాడు. కెందామరలవంటి పాదాలపై గంగాజలం పోస్తూ-ఈ భూ ప్రపంచంలోని ఏ నదీ పుట్టినచోటికి తిరిగి చేరటం వినలేదు. గంగమ్మ తల్లీ ఒక్క నీదే ఈ అదృష్టం!

సాగింది నావ-సీతారామలక్ష్మణులు సుఖాసీనులై రమణీయమయిన గంగాతీర సౌందర్యాన్నవలోకిస్తున్నారు. మెల్ల మెల్లగా నదీ మధ్యం చేరుకుంటోంది నావ. గుహుడు అనిమేషుడే అయినాడు. తన కెదు రుగానున్న నీలమేఘ సుందరమూర్తి తప్ప, సమస్త ప్రపంచమూ అతనికి అగోచరమే అయినది. గంగలేదు. నావ లేదు. నడపడమూలేదు. ఏమీ లేదు. ఒక్క శ్రీరామ చంద్రుడు తప్ప. ఎలా చేరిందో- పడవ ఆవలి ఒడ్డుకు చేరింది.

రామచంద్రుడు తాను నావ దిగినాడు. చేతి ఆసరా ఇచ్చి సీతమ్మను దింపుకున్నాడు. ఆ వెనుక లక్ష్మణుడూ దిగాడు. ఆ వెనుక గుహుడూ నావ దిగి వచ్చి వారి ఎదురుగా చేతులు మోడ్చి నిలుచున్నాడు. మళ్ళీ అంతే, మాటలురాని మూగతనం.

అట్టే కొంత తడవయినాక రామయ్య-గుహుడా! మమ్మల్ని సురక్షితంగా ఈవలి తీరానికి చేర్చావు. చాలా సంతోషం. ఇక నీ పడవ కిరాయి తీసుకుని వెనుకకు మరలి నీ నిత్యకార్యక్రమం చూసుకోవయ్యా అన్నాడు. ఈ మాటలతో ఇహంలోనికి వచ్చిన గుహుడు, ఇంకా మాటాడకపోతే సమయం మించిపోతుందనుకున్నాడు. చేతులు జోడించి ఇలా అన్నాడు-

రామయ్యా, సాటి కులం వాడిని ఇలా అవమానిం చటం న్యాయమేనటయ్యా నీకు. నీదీ నాదీ ఒకటే వృత్తి అని ప్రపంచాని కంతటికీ తెలుసు. అలాంటప్పుడు నాకియ్యా వలసిన కూలి డబ్బుల ప్రసక్తి ఎక్కడుం దయ్యా. అవసరానికి ఒకరికొకరు ఆదుకోవటానికి కాకపోతే కుల వృత్తులెందుకు? నాకంటే నువ్వు అత్యంత నిపుణుడివే అనుకో-అంత మాత్రాన నన్నవమానిస్తావా? ఈ రోజు నిన్ను నే నీగంగ దాటించానే అనుకో- రేపు నువ్వు నన్నీ సంసార సాగరం దాటించవా? చెల్లుకు చెల్లు. రామా పైకం వద్దు. నిన్ను నేను (గంగను) తరింప చేశాను. నన్నూ నువ్వు తరింపజెయ్యి ప్రభూ, ఇంకేమీ వద్దు. ఈ ఒక్క సహాయం చెయ్యి స్వామీ! ఆజన్మాంతం కృతజ్ఞుడివి తండ్రీ!

శబ్దాత్మకుడయిన శ్రీమన్నారాయణమూర్తి అయిన అంతటి శ్రీరామచంద్రమూర్తికి- ఆ భక్తి ముందూ, ఆ తర్కం ముందూ వచించటానికొక్క శబ్దం దొరక లేదు. ముగ్ధుడయిన సీతాపతి తన ఆజానుబాహువులు రెంటినీ చాచి గుహుడిని హృదయానికి హత్తుకున్నాడు. జాన కమ్మతల్లి తన ఎడమకంటి చివర మెరిసిన తడిని తననార చీర కొంగుతో ఒత్తుకుంది.